*వ్యక్తావ్యక్తంలో యుద్ధం

[కథానిక]

❀

= శ్రీ వై. ఐ. రమణమూర్తి =

మాలతికీ, భాస్కరానికీ మొట్టమొదట ఎలా పరిచయమైందో ఎవరికీ జ్ఞాపకం లేదు. పరిచయమైన మొట్టమొదటి రోజుల్లో ఇద్దరూ అనేకవిషయాల్లో భిన్నాభిప్రాయాలు కలిగివుండి తెగవాదించుకునేవారు. అతనికీ పనేమీ లేదు. డబ్బు కావలసినంత వుంది తిని కూర్చోడానికి. మాలతిభర్త ఆఫీసుకి పోగానే దానికి కావలసినంత తీరిక.

తనకూ నిజంగా మనస్సు వుందనీ, దానికి స్వతంత్రంగా ఆలోచించే శక్తి వుందనీ ఇప్పటివరకూ తెలుసుకోలేని మనుష్యుల్లో భాస్కరం ఒకడు. అతనికెప్పుడూ తన అభిప్రాయాలమీద నమ్మకం లేదు. రాజకీయ విషయాలనుగురించి ఆలోచించడాని కూర్చుని చివరికి గాంధీగారి పటందగ్గిరికెళ్లి ఆయనమీద ఆ భారం వదిలేసి వచ్చి పడుకుంటాడు సుఖంగా. మాలతి అంచేతనే ఇతన్ని వేళాకోళం చేస్తుంది.

మాలతి చదువుకున్న పడుచు. భర్త ఈశ్వర్రావు ఒక ఫరమ్‌లో ఉద్యోగిగా వుంటున్నాడు. ఆస్తికూడా వుంది. భాస్కరం వీళ్ళింటికి వచ్చీ పోతూవుండడంతో భాషాప్రయుక్తరాష్ట్రసమస్యదగ్గిర ప్రారంభమైన వీళ్ల యుద్ధంలో కొన్నాళ్ళకు సంధి కుదిరింది. భాస్కరం వాళ్లింటికొచ్చేటప్పటికి తన నల్లని విశాల నయనాలతో ఆమె స్వాగతం ఇస్తుంది. ఆమెభర్త చిరునవ్వుతో ఆహ్వానిస్తాడు. అందరూ కలిసి కులాసాగా కాలాన్ని మరిచిపోయి గడుపుతారు. భాస్కరానికి వాళ్ళ యింట్లోనూ, వాళ్ళ హృదయాల్లోనూ కూడా కావలసినంత చోటు దొరికింది. వాళ్ళ దగ్గిరున్నంతసేపూ స్వర్గధామంలో వున్నట్టు భావిస్తాడు భాస్కరం. అతను మంచి చిత్రకారుడుకూడాను. అతను మాలతిని చూడకుండా ఒక్కక్షణం వుండలేడు. తనకు పనేం లేదుకనక పగలంతా ఈశ్వర్రావుగారింట్లోనే గడుపుతాడు. ఈశ్వర్రావుకూడా భాస్కరాన్నెంతో వెఱ్ఱిగా ప్రేమించాడు. భాస్కరం అంటే అతనికి ప్రాణం. ఒక్కమాటలో చెప్పాలంటే — ఆ ముగ్గురి శరీరాలు మాత్రమే వేరు. మనస్సు ఒకటే.

మాలతంటే తన కెందుకో అంత ప్రేమ. భాస్కరానికి అర్థంకాలేదు. అసలా ప్రేమస్వరూపం ఎలాంటిదో కూడా అతను అవగతం చేసుకోనూలేదు. అందుకు ప్రయత్నించనూ లేదు. మాలతి తనను విపరీతంగా ఆకర్షిస్తుందనిమాత్రమే అతనికి తెలుసు. అది ఎలాంటి ఆకర్షణో అతనికి తెలీదు.

బాగా బారెడు పొద్దెక్కింది. మాలతికి ఇంటిపనుల అడావిడిలో ఇంతవరకూ తలదువ్వుకోడం పడలేదు. ఇప్పుడు తలదువ్వుకుని నీళ్ళుపోసుకుని, చీరకట్టుకుని బీరువాఅద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది. మాలతి నిజంగా జగదేకసుందరి. ఆమెప్రతిఅంగంలోనూ తరుణయౌవనం తొణికిసలాడుతోంది. తన అందానికి తనే ముగ్ధురాలైపోయింది. అద్దంలో ప్రతిబింబం చూసుకోగానే ఆమె కొకవిధమైన ఉత్సాహం,

* వ్యక్తావ్యక్తం—Sub-consciousness.

మనోబలం వచ్చినట్టయింది. వదనం ఆనందంతో మెరిసిపోయింది. ఆనందరేఖ లింకా ఆమె పెదవులమీద నాట్యం ఆడుతూనేవున్నాయి. "మాలతీ" అన్న పిలుపు విని వెనక్కు తిరిగిచూసింది.

అప్పుడే లేచి కళ్ళు నులుముకుంటూ వచ్చినట్టున్నాడు భాస్కరం! కేర్‌లెస్ (అజాగ్రత్త) గా వదిలేసిన జుట్టూ, అతనూ! తిన్నగా వాళ్ళు పడుకునే పందిరిమంచంమీద కూర్చున్నాడు వెళ్ళి. ఎవరి నోటి నించీ మాటలేదు. ఆమె ఆశ్చర్యంతో మాట్లాడలేక పోతోంది. ఏమంటే ఇంతవరకూ అత నెప్పుడూ ఆ పందిరిమంచంమీద కూర్చోలేదు. ఎన్నోమాట్లు ఈశ్వ్రరావు కూర్చోమన్నా కూర్చోనన్నాడు. "వాళ్ళు పడుకునే మంచంమీద నేను కూర్చోకూడదు. తప్పు" అని అతని అభిప్రాయం. అలాంటివా డివేళ ఇలా ప్రవర్తించాడేమిటీ అని ఆమెసందేహం.

"నువ్వు చాలా అందంగా వున్నావు మాలతీ. ఈ గది అంతా బంగారపుగీరానినట్టు ఎలా వుందో చూడు! అలాగే నుంచో ఒక్క క్షణం—" అని తన స్కెచ్చిపుస్తకం తీసి పెన్సిలుతో బొమ్మ రాయడం మొదలెట్టాడు. మాలతికి అతని ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు. కాని అక్కణ్ణుంచి కదల్లేకపోయింది. అలాగే నిలబడింది. బొమ్మ గియ్యడం పూర్తయ్యాక భాస్కరం తలెత్తిచూశాడు. మాలతి ధైర్యంచేసిఅడిగింది. "ఏమిటి పొద్దున్నే వచ్చావు?"

"ఏమో. నే వచ్చినపని మరిచిపోయాను......" అంటూనే చెప్పడం ఆపేసి బొమ్మకేసి పరీక్షగా చూడడం ప్రారంభించాడు మళ్ళీ.

చేతిలో వున్న రవిక కుర్చీచేతికి వేసికొట్టి చిరాకుగా వున్నట్టు "ష్. అబ్బ! ఎందు కొచ్చావ్ చెప్పవూ చంపక" అంది మాలతి.

అతను తలెత్తి చూశాడు. "కోపం వచ్చిందా? ఏం చేసినా చెయ్యి. జ్ఞాపకంరావడం లేదు—కాని చూశావా. ఇంతవరకూ ఎప్పుడూ నీ బొమ్మలు గియ్యనే లేదు. చూశ, ఇది నీకు ప్రెజంట్ చేసా..."

"అయితే నీతో కూచోడానికి తీరికలేదు. దొడ్లో పనుంది. జ్ఞాపకంవచ్చినప్పుడు అక్కడికి వచ్చి చెప్పు. నే వెడుతున్నా."

"మాలతీ!"

వెనక్కు తిరిగిచూసింది. భాస్కరం దగ్గరగా వస్తో అంటున్నాడు. "ఏం లేదు. నిన్ను చూడాలనిపించింది, వచ్చేశాను—మంచిఫలితం ఈస్కెచ్ వేసుకున్నాన........"

మామూలుగానే అనేస్తున్నాడు. "కాని నువ్వు నన్నింతగా ఆకర్షిస్తావేం మాలతీ? నువ్వంటే ఏమిటో—..."

తన మనస్సులో ఆందోళనంతా కళ్లల్లో చూపిస్తూ మాలతి ఏమీ మాట్లాడలేక నుంచునిపోయింది. వచ్చిన పని మరిచిపోయానంటే ఆమె అంత ఆశ్చర్యపోలేదు. అది అతనికి మామూలే. కాని ఈ ప్రశ్న అతనేవుద్దేశంతో అడుగుతున్నాడు?

"మరీ చిన్నపిల్లాడివై పోతున్నావ్, ఏమి టామాటలు భాస్కరం?" అని గదిమింది. భాస్కరం సూటిగా దాని కళ్లల్లోకి చూశాడు. "నీకలా తోచిందికదూ. సరేలే" అన్నట్టున్నాయి ఆ చూపులు.

"క్షమించు భాస్కరం" అనా లనుకుంది. నోటి చివరికి వచ్చిందికూడాను. ఇంతట్లోకే భాస్కరం గబగబా గుమ్మం దాటిపోయాడు. అతని కళ్లల్లో బాధ కనుపించింది.

"భాస్కరం!" అని కేక వేసింది.

కాని అప్పటికే అతను గుమ్మం దాటిపోయాడు.

ఆ వేళ అతను మళ్లీ వాళ్లింటికి రాలేదు. ఈశ్వ్రరావు రెండుమూడుసార్లు ఆఫీసునించి కబురంపేడు "మాలతి కేం తోచదు. కాస్త మా యింటి కెళ్లి కబుర్లు చెప్పకోండి" అని. అయినా అతను రాలేదు.

మర్నాడు పొద్దున్న ఇంకా పెందరాళే భాస్కరం మాలతిగదిలోకి వచ్చాడు. మాలతి ఇంకా పక్కమీదే పడుకునివుంది, బద్ధకంగా, తలుపు తీసేవుంచి. అతను రావడం చూసి లేచి బీరువాఅద్దంలో చూసుకుని

బొట్టు దిద్దుకుంది. అతను ఆశ్చర్యంతో దానివంక చూస్తో అడిగాడు.

"ఈశ్వరం ఊళ్లో లేడా? ఇంత ఇల్లూ నువ్వొక్కర్తెవే కాపలా కాశావా రాత్రంతా?"

"అవును. నిన్న సాయంత్రం వెళ్లారు" అంది వెనక్కి తిరక్కుండానే.

"అరె! నాకు కబురంపకపోయావా? సాయం పడుకుందుకు వచ్చేవాణ్ణే!"

మాలతి వెనక్కి తిరిగింది. దాని పెదవులు వణికిపోతున్నాయి. అతను నిన్న అలా వెళ్లిపోడానికీ అర్థం తెలియలేదు. ఇవేళటి ఈ అకారణదయకూ అర్థం తెలియలేదు దానికి. భాస్కరంముఖంలోమాత్రం ఏమార్పూ లేదు. మాలతిమెదడులో ఎన్నెన్నో ఆలోచనలు పరుగులుతీశాయి. ఒక వందసమాధానా లాలోచించింది. "నీ సహాయం అవసరంలేదు" అందా మనుకుంది. కాని వెంటనే నిన్నటి అతని ముఖం జ్ఞాపకంవచ్చి ఇంత చిన్నవిషయానికే నొప్పించడం ఎందుకనుకుంది. అంచేత తేలిగ్గా, "నాకేం భయమా? ఊరికేనే—ఎందుకని కబురంపలేదు" అనేసింది.

"సరేకాని, ఇవేళకూడా ఇంకో స్కెచ్ వేసుకోడాని కొచ్చాను. ఇంకోపోజులో కొంచెంసేపు నిలబడు."

ఆ అధికారస్వరానికి దానికి కోపం వచ్చి ముఖం కందిపోయింది.

"భాస్కరం, నాకింకేమీ పను ల్లేవనుకున్నావా?"

"అది కాదమ్మా చెల్లాయి—కోపంవస్తే నేనేం చెప్పను? ఎప్పుడూ నీతో మాట్లాడాలనీ, నీదగ్గరే వుండాలనీ వుంటుంది. ఇలాంటి పనేదో చేస్తూ నీదగ్గిరే చాలాసేపు కూచోవాలనిపిస్తుంది. నీ కిష్టంలేదుకదూ. నే వెళ్ళిపోతాలే..." అంటూ లేచాడు. మాలతేమీ మాట్లాళ్ళేదు. వెళ్లిపోతున్నాడు. అయినా అదేమీ మాట్లాళ్లేదు.

"చెల్లాయి!" అని అతను చేసిన సంబోధనమీదే వుంది దాని దృష్టంతా. అత నెప్పుడూ దాన్నలా పిలవలేదు—ఆశ్చర్యంకాదూ?

ఇలా ఆలోచించుకుంటూ నూతిదగ్గిరికి వెళ్లిపోయింది. కాని చేసే ఏ పనిమీదా దృష్టి నిలవడంలేదు. భాస్కరంరాకకూ మాటలకూ అర్థం ఏమిటి? అత నొకరకం పిచ్చిమనిషి అని దానికి తెలుసు. కాని అతని మాటల్లో అర్థంలేకపోలేదని దాని నమ్మకం. తనను అత నెలా ప్రేమిస్తున్నాడు? చెల్లెలిగానా—లేక.....

బహుశా తనమీద అతనికి మరోభావమే వుందేమో. తనంత అందకత్తె ఎక్కడా వుండదని చూసిన వాళ్లంతా వప్పుకుతీరతారు—తన అందం చూసి అతను కామించడం లేదుగదా—అతన్ని చూస్తే దానికి జాలి పుట్టుకొస్తోంది.

౨

"అబ్బ! ఎంత గడిబిడి చేశావు పదిరోజులు—నాలుగురోజులు ను వ్వసలు బతకవనుకున్నాం. ఎంతపని చేశావు! జరం వొచ్చినసంగతి నాదగ్గిర దాచా లనుకున్నావా? కబురుచెయ్యకూడదేం?" అని కళ్లంట నీళ్లెట్టుకుంది మాలతి.

భాస్కరం ఇంకా నీరసంగానే వున్నాడు. తన మంచంమీదే కూచునివున్న మాలతిముఖం చూసి అతనికీ ఏడు పాగిందికాదు.

"మాలతీ, నేనంటే నీకు కోపం వొచ్చింది కాదూ?"

మాలతి బావురుమని ఏడవకపోయినా అంతపనీ చేసింది. భాస్కరానికి కెవరూ లేరని అది ఈమధ్యనే తెలుసుకుంది. భాస్కరం జ్వరంతో పడిపోయిన రెండురోజులకు ఆసంగతి తెలిసి ఈశ్వరం తీసుకొచ్చాడు. ఈ పదిరోజులూ మాలతే అతనికి సేవచేసి, చెల్లెల్లాగ కాపాడింది. వాడి నిస్సహాయత్వం చూసి దానికి జాలేసింది. వాడి జుట్టు సవిరిస్తో "ఎందుకొట్టప్పడతాను? నువ్వంటే నాకు ఎంతప్రేమో తెలుసా" అంది కన్నీరు తుడుచుకుంటూ.

వాళ్లిద్దరూ తన కంతగా సేవచేసినందుకు కృతజ్ఞత తెల్పాడు భాస్కరం.

ఒకనాడు మాలతి ఒంటరిగా నూతిదగ్గిర నీళ్లు తోడుతోంది. భాస్కరం వచ్చాడు. ఇద్దరూ ఏవేవో మాట్లాడుకున్నారు.

"నీకీఒంటరితనం దుర్భరమనిపించడం లేదూ భాస్కరం ?" అంది.

"ఏం చెయ్యమంటావు మాలతీ......" అతను మరి మాట్లాళ్లేదు.

ఈ ఎదురుప్రశ్నలో ఎంతో హృదయవేదన వుందనీ, ఎంతో బాధాయుతమైన అతని జీవితగాథ నిక్షిప్తమైవుందనీ మాలతి గ్రహించింది. జాలిగా నిట్టూర్చింది.

"నాగొడవ కేంగాని, మాలతీ, చూడు-నీబొమ్మలు పూర్తిచేసి తెచ్చా. చూడు ఎంత అందంగా వున్నావో ఈపోజుల్లో—ఇవి నీకు ఇస్తున్నా. పుచ్చుకుంటావు కాదూ వద్దనకుండా...?"

"ఎందుకు వద్దంటాను భాస్కరం ?"

* * *

చాలా రాత్రయింది. శరత్కాలచంద్రుడి కిరణాలు డాబా మెట్లపక్క ఆనుకునివున్న రాధామనోహరపుతీగల సందుల్లోంచి మెట్లమీద పడుతున్నాయి. భాస్కరం డాబా ఎక్కబోతూ ఆ వెన్నెల్లో పాలగచ్చులా మెరిసే ఆ మెట్లదగ్గిర ఒక్క క్షణం నుంచుని పోయాడు. అతను కళారాధకుడు. అందమైన ప్రతీ విషయం అతణ్ని ఆకర్షిస్తుంది. ఇంతలో "భాస్కరం!" అన్న కేక.

ఎదురుగా గుమ్మం దిగి మెట్లదగ్గిరికి శరల్లక్ష్మిలా వస్తున్న మాలతి! అతను ఆశ్చర్యపోయాడు. "మాలతి ...ఇంతరాత్రివేళ...ఇక్కడికా!" అనుకున్నాడు.

ఆ సమయంలో మాలతి అతని కళ్లకు ఎంతో అందంగా కనుపించింది. ఆమె కట్టుకున్న చీరా, తొడిగిన రవికా, అలంకరించుకున్న విధానం—ఆ రంగుల వివరాలు—అతని కంతగా గుర్తులేవు. కాని సమగ్రమైన సౌందర్యదేవత అతని ముందు నుంచున్నట్టు భావించాడు. మాలతి ఉత్సాహంతో ఒక్కపరుగులో వచ్చేసింది మెట్లదగ్గరకి. భాస్కరంచేతులు పట్టుకుని "నీకోసమే వచ్చా" అంది.

"మాలతీ...నువ్వు...ఇంతరాత్రివేళ..."

"ఆ! నేనే—రేపు నా పుట్టినరోజు. డిన్నర్ పార్టీకి రావాలి నువ్వు—రేపు స్వయంగా పిలవడానికి తీరిక కాదని ఇప్పుడే వచ్చాను. రేపు నా స్నేహితురాళ్లు కొందరు వస్తారు. వాళ్లతో మాటల్లో ఓడిపోవడానికి సిద్ధంగా వుండాలి నువ్వు..."

"ఇప్పుడు ఈశ్వరం నిన్నెలా రానిచ్చాడు ?... రానిచ్చాడా ?"

"వెళ్లొద్దనే అన్నారు. కాని నేనే వచ్చేశాను"

ఒక్కసారిగా ఆలోచనలో పడిపోయి—

"వెళ్లొద్దన్నాడా-అలాగా-అయితే నువ్వెందుకొచ్చావు ?"

"అబ్బ! దాని కేంగాని, నువ్వొస్తావుకదూ."

విలాసంగా అతని చేతులు పట్టుకు లాక్కుడుతోంది. మెట్లదగ్గర్నుంచి అయిదారుగజాలు నడిచాడు పరధ్యాన్నంగానే. హఠాత్తుగా ఆగిపోయి మాలతి రెండు చేతులూ పట్టుకున్నాడు ఉద్వేగంతో వణికిపోతూ...

"మాలతీ—నిన్ను ప్రేమిస్తున్నాను." అన్నాడు.

భాస్కరానికూడా ప్రేమంటే తెలుసా ? మాలతి తన చేతులు విడిపించుకోబోయింది. అతను దీనంగా అడిగాడు.

"మాలతీ, నన్ను ప్రేమించడం లేదా ?

"ఛీ! నన్ను వొదులు..." విడిపించుకుని మాలతి గబగబా వీథిలోకి వచ్చేసింది. ఆమెహృదయం సంక్షుభితమైపోయివుంది. భయంతో వణికిపోతో ఇంటివైపు పరుగెత్తింది. ఆ సమయంలో భాస్కరం అన్న మాటల్ని అది మరిచిపోలేదు.

"ఎందుకలా భయపడతావ్? నేనేం రాక్షసుణ్ణా—అయితే వెళ్లవచ్చు. వెళ్లు."

తిన్నగా తన పడకగదిలో మంచంమీద కళ్లిబోర్లా పడుకుని ఏడవడం మొదలెట్టింది. అవతలగదిలో

ఈశ్వరం ఇంకా ఏదో రాసుకుంటూనే వున్నాడు. దాని కన్నీళ్లతో దిండు అంతా తడిసిపోయింది. ఓదార్చేవా రెవరూ లేకపోవడంచేత కొంత ఉద్వేగం తగ్గి కాస్సేపటికి మాలతి తలెత్తిచూసింది. రేగిపోయిన జుట్టు. చెమటకి చెరిగిపోయినబొట్టు! తనదేనా అద్దంలో ప్రతిబింబం? భాస్కరం తనకు అవమానం చేశా డనుకుంది కొంతసేపు. కాని ఎంత వెఱ్ఱివాడైనా అతనికిమాత్రం హృదయం లేదా? ఇతరమానవుల ప్రేమని కోరడా? మానవహృదయాలను మథించివేసే మహత్తరకార్యాల నిలాంటివాళ్లే ఒక్కొక్కసారి చేస్తారు—అనుకుంది. ఈశ్వరం వచ్చి పలకరించాడు.

"ఏడుస్తావేం మాలతీ..."

ఏం చెప్తుంది? కన్నీళ్లు తుడుచుకుంది...తడబడుతూ...ఈశ్వరంకూడా గుచ్చి అడగనూలేదు. ఇది కొంత విచిత్రంగానే వుంది.

మర్నాడు తెల్లారకట్ల లేచి మేడకిటికీతలుపు తెరిచేసరికి ఆ మసకచీకట్లో భాస్కరం ఇంటిముందు బండీ, అందులో సామాను వేస్తోన్న నౌకరూ కనిపించారు. మాలతిప్రాణం తల్లడిల్లిపోయింది. భాస్కరం ఎక్కడికో వెళ్లిపోతున్నాడు. నిన్నరాత్రి తనలా వచ్చేసింది—భాస్కరాన్ని విడిచి ఒకరోజుండలేదు అది ఈ ఏడాదినించీ.

"సంగతేమిటో కనుక్కొనివస్తారా?" అని ఈశ్వరా న్నడిగింది. "ఏముంది, ఎక్కడికో వెళ్తున్నట్టున్నాడు. వాడే తిరిగొస్తాడు" అన్నాడు తనపని చూసుకుంటూనే ముభావంగా.

"అయితే నేనే వెడతాలెండి"

"మాలతీ, ఆగు, వీల్లేదు. నువ్వెళ్లడానికి వల్లకాదు."

ఈశ్వరం రుద్రరూపం దాల్చి ఇలా ఆదేశించాడు. మాలతి కొంచెం భయపడింది. అప్రయత్నంగా దానికి ఏడుపొచ్చేసింది. భాస్కరాన్ని ఇంక చూడననీ, భర్తకోపం చూసీ. తలొంచుకు నిలబడింది. రెండు నిమిషా లెవరూ మాట్లాడ్లేదు.

"నీ కన్నీళ్లు అందరి కన్నీళ్లలాంటివి కావు—వెళ్లు మాలతీ—వెళ్లు—నేనడ్డగించను...నీ పుట్టినరోజునాడు నీకు కష్టం కల్గించను. వెళ్ళు మాలతీ..." అన్నాడు మళ్లీ ఈశ్వరం.

బెదురుతోన్న కళ్ళతో, సందేహంతో అతని కళ్లల్లోకి చూస్తూ కదలకుండా నుంచుంది మాలతి. అది చూసి అత నన్నాడు:

"వెళ్ళు మాలతీ. ఆలస్యంచేస్తే వాడు వెళ్ళిపోతాడు—ఒకమాట—వాడు నీకిచ్చిన పటాలు తిరిగి ఇచ్చెయ్యి. పట్టుకెళ్లు—ఊఁ. నిన్నరాత్రి జరిగిందంతా నేను చూశాను. అయినా ఆ పటాలు అట్టేపెట్టుకోడం మంచిదికాదు."

అంటూ అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు ఈశ్వరం.

మాలతి భాస్కరంగదిలో కాలుపెట్టేసరికి—అతను ఈశ్వరంఫోటోను కిందపారేసి బద్దలుకొట్టి కాళ్ళతో తొక్కుతూండడం చూసేసరికి దానికి ఎదురురొమ్మమీద కుంపటిపెట్టినట్టయింది. ఏడవడం మొదలెట్టింది. ప్రాణస్నేహితుణ్ణి కాళ్ళతో గౌరవిస్తున్నాడు!!!

"భాస్కరం, అఫోటో కాదు. ఇలా రా. ఇదిగో నా మంగళసూత్రం నీకాళ్ళకింద నలిపిపారెయ్యి. నీకసి తీరుతుందేమో."

ఏడుపు దిగమింగి, శాంతంగా-గద్గదస్వరంతో ఈమాటలంది. తేజస్వంతం, గంభీరం అయిన ఆముఖం కేసి అతను చూడలేకపోయాడు.

"క్షమించు మాలతీ......

"మాలతీ, మళ్లీ వచ్చావేం ? ఎలా వచ్చావు?"

మాలతి తన రెండుచేతుల్లోనూ ముఖం దాచుకుని ఏడవడం మొదలెట్టింది. "నిన్ను చూడకుండా ఒక్కరోజుండలేను భాస్కరం. నువ్వెళ్లిపోతే ఎలా-నిన్నరాత్రి నాప్రవర్తనవల్లేనా నువ్వీవూరు విడిచి పోతూంట?- వెళ్ళకు, ఇక్కడికి వస్తోంటే ఆయ నెలా కేకలేశారనుకున్నావు! నిన్నరాత్రి నువు చేసినపని ఆయన చూశారు. నావెనకాలే వచ్చి. అమ్మో!"

అని విద్వేషం మొదలెట్టింది. మాలతి ఏడిస్తే కూడా అందంగానే వుంటుంది. "నన్ను పెళ్ళొద్దనా నీకోరిక? నేనెక్కడవున్నా నీ క్షేమం తెలుసుకుంటూనే వుంటాను మాలతీ— నిన్ను ప్రేమిస్తూనేవుంటాను—"

"అక్కర్లేదు. నాకేం చెప్పక్కర్లేదు. నన్ను గురించి మళ్ళీ తలచకుండానే వుండు. అదే మంచిది. ఏమంటే, నీసన్నిధిసుఖం కోల్పోయిన నేను— ఆ సుఖాన్ని గురించిన జ్ఞాపకాలతో తృప్తిపడమంటే పడలేను." అంది నిరాశగా.

గడ్డం పట్టుకుని బుజ్జగిస్తూ అన్నాడు. "ఈశ్వరం ఈర్ష్యపడుతున్నాడు కాదూ—కోపం తెచ్చుకున్నాడేం? అయితే నేనెందుకీవూరు విడిచిపోవాలి? నే పోనే పోను— నువ్వింటికెళ్ళు మాలతీ......"

ఈ మాటలనేటప్పు డతని ముఖంలో ఈర్ష్య, కుటిలత్వం ప్రస్ఫుటంఅవుతున్నాయి. మాలతి వాటిని గ్రహించింది. ఉత్తరక్షణంలో అవి ఆముఖంలో లేకపోవడంకూడా చూసింది. కాని భాస్కరంమనస్సేలాగ పనిచేస్తోందో ఏమీ తెలుసుకోలేకపోయింది. భాస్కరంలో ఈ మార్పుకు కారణం తను ఈశ్వరంసంగతి చెప్పడమే. "ఎంత తెలివితక్కువగా ఏడుస్తూ అదంతా చెప్పేశాను!" అనుకుంది.

"నిన్నటి నాప్రవర్తనకు క్షమించు భాస్కరం. నాహృదయం కలిగిపోయివుంది— కర్తవ్యనిశ్చయం చేసుకోనీ. అయితే నువ్వు వెళ్ళవుకదూ—"

"వెళ్ళను. కాని మాలతీ, ఒక్కటిమాత్రం జ్ఞాపకంపెట్టుకో. నేను నీపాదాలదగ్గిర ప్రేమభిక్షార్థినై వుండను. నిజానికి నిన్ను నేను ప్రేమించడం లేదు. కాని ఏదో నేనెరగని నాలోని కోరిక నువ్వంటే అభిమానించేటట్టు చేస్తుంది. విన్నావా మాలతీ" రోషంతో అన్నాడీమాటలు.

మాలతి జాలిగా, స్నేహంగా అడిగింది: "అయితే పాపం నన్ను ప్రేమించడం లేదన్నమాట?"

"అవును. కాని నువ్వెందుకు వచ్చావిప్పుడు?" అన్నాడు ప్రశాంతముఖంతో.

"ఏం లేదు. వెళ్లిపోతున్నావంటేను—"

"వద్దని చెప్పడానికే వచ్చావా?"

ఎంత అహంభావం? మాలతి ఆశ్చర్యపోయింది.

"కాదు- సాగనంపడానికే వచ్చాను. నిన్ను చూస్తే జాలేస్తుంది భాస్కరం. వెఱ్ఱివెఱ్ఱివేషా లెయ్యక ఉండు— రా మా యింటికి—"

ఈమాటలు అని మాలతి తిరిగి వెళ్లిపోయింది. దాని కాళ్లు తడబడుతూండడం భాస్కరం గ్రహించాడు. అది వెళ్ళేటప్పు డతనిలా అన్నాడు:

"నన్నుగురించి జాలిపడొద్దు మాలతీ. కాని ఎన్నడూ నేనంటే నీకు కోపం రాకుండావుండాలని ప్రార్థిస్తాను. చాలా తప్పులు చేసివుంటాను. వాటిని క్షమించే విశాలహృదయం నీది—..."

ఇవన్నీ మాలతికి బహుశా వినపడిఉండవు.

నౌకరు బండిలోసామాను తెచ్చి ఇంట్లో పెట్టాడు.

మాలతిమాత్రం భాస్కరంప్రవర్తనకు అర్థం ఆలోచిస్తూనే కాళ్లుతడబడుతూ వెళ్ళింది.

3

ఈశ్వర్రావే వెళ్లి భాస్కరాన్ని భోజనానికి తీసుకొచ్చాడు బలవంతంచేసి. మాలతి ఇవేళ ఇరవై ఒకట్లోఏట పాదంపెట్టింది. మధ్యాహ్నం తాను ఊరికి వెడుతూ భాస్కరాన్ని రాత్రికి అక్కడే పడుకోమని చెప్పిపోయాడు ఈశ్వరం. ఆవేళ పగలల్లా మాలతిని పలకరించడానికూడా ప్రయత్నించలేదు భాస్కరం. రాత్రి భోజనందగ్గిర మాలతి అంది:

"అన్నంకూడా సరిగ్గా తినవేం? నిన్నుచూస్తే జాలేస్తుంది."

"అలాంటిది అనవసరం" అన్నాడు కరుగ్గా.

మాలతి నవ్వింది కిలకిలా.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నా ననుకుంటున్నావేమో—నీఅభిప్రాయా లెప్పుడూ సరైన పాపాన పోలేదు...".

"నాస్థితి నీకు వేళాకోళంగా కనిపిస్తోందికదూ మాలతీ."

మాలతికి కళ్ల నీళ్ల పర్యంతం అయింది. ఒక్కొక్క సారి ఒక చిన్న మాట చాలు మనస్సుకు సూటిగా తగిలి ఏడ్పు తెప్పించడానికి.

"క్షమించు భాస్కరం, నాకు మాత్రం హృదయం లేదా?"

*   *   *   *

మాలతి ఆరాత్రి నిర్మలంగా ఆలోచించడం మొదలెట్టింది. తను ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలి—దానికి భాస్కరంమీద వున్న ప్రేమ స్వచ్ఛమైన సోదరీప్రేమ. తనను ప్రేమించే హృదయం, తనను గురించి జాగ్రత్తతీసుకునే మనిషీ లేకుండా భాస్కరం ఎలా జీవితం గడుపుతాడు? తను కోపగిస్తే—అతను పాపం అమాయకుడు—ఇంతకూ తన్నెలాగ ప్రేమిస్తున్నాడు? తనను చెల్లాయిలా చూడ్డంలేదా? తనను కామిస్తున్నాడా?

ఈ ఆలోచన కలిగేసరికల్లా—అసహ్యంతో, భయంతో, ఇంకా ఎన్నిటితోనో దాని వొళ్లు జలదరించింది. "ఛీ—భాస్కరం నాఅన్నయ్య" అనుకుంది.

"తమని అందరూ ప్రేమించాలి అని స్త్రీలు ఉబలాట పడతారు. తీరా ఇలాంటి సమస్యల్లోనో—లేక విసుగులోనో—పడతారు. నాకీస్థితి తప్పించవా భగవాన్—"

బోర్లా పడుకుని ఏడవడం ప్రారంభించింది.

"మాలతీ, ఏడుస్తున్నావా?"

మాలతి వెంటనే మంచంమీద లేచి కూర్చుంది. ఆ కూర్చోడంలోకూడా కళారాధకుడైన అతను విలాసాన్నే చూడగలిగాడు.

గదిగోడలకు నీలిరంగు. గదిలో బల్బు నీలిరంగుది—ఆరంగులో ఆమె తెల్లనిశరీరం, తెల్లనిదుస్తులు, అందం, నవతారుణ్యం — ఎవరినైనా మోహాపరవశులను చేసి మత్తెక్కించితీరతాయి.

"నువ్వు చాలా అందంగా వున్నావు మాలతీ. నీ నవ్వువెలుగులో నే నీప్రపంచాన్నే మరిచిపోతాను. నీఅందాన్ని నాకళ్లతో తాగేస్తాను. నిత్యం ఈ నీ రూపం నాకళ్లముందు నాట్యం చేస్తూంటే ఎంత హాయి!" అంటున్నాడు భాస్కరం.

మాలతిముఖంలో నిశ్చలత్వం అధిష్ఠించింది. నిశ్చలంగా, నెమ్మదిగా నిశ్చయించుకుని, ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భంగపరుస్తూ ఇలా అంది:

"భాస్కరం! నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను."

ఆమెకంఠంలో గద్గదిక ఇంకా పోలేదు.

మరొకరైతే—ఆ అర్ధరాత్రివేళలో ఒంటరిగా వున్న మాలతిఅంతటిసౌందర్యఖని "నిన్ను ప్రేమిస్తున్నా"నంటే దగ్గిరికి ఒక్కదూకు దూకి దాని గులాబీ పెదవులమీద ముద్దులవర్షం కురిపించేవారే—

కాని భాస్కరం మాట్లాడకుండా తన గదిలోకి తిరిగివెళ్లిపోయాడు...మాలతి ఆశ్చర్యంతో అలాగే కూచుంది.

"అక్కయ్యా!"

ఆ అర్ధరాత్రివేళ నాగొంతుక అలా వినిపిస్తుందని అది కల్లోకూడా వూహించివుండదు—తలుపు తీసి దుఃఖం పట్టలేక నన్ను గట్టిగా కౌగిలించుకుని ఏడవడం మొదలెట్టింది. ఎంత సున్నితహృదయం దానిది! జీవితంలో దానికింకా ప్రేమించతగ్గవాళ్లెవరేనా వుంటే అది నేనే. తన కష్టాలు, సమస్యలు, జీవితంలో ఒడుదుడుకులు నాతోకాక ఎవరితో చెప్పుకుంటుంది? పురుషులెవ్వరికీ దాన్నర్థంచేసుకునే శక్తి లేదు. ఉండదు. ఈసంగతంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

"నీ సలహా ఏమిటి చెల్లీ? నాకంటే నువ్వెంతో జ్ఞానం కలదానవు. బోలెడు చదివావు. ఈవిషయంలో మీఅక్కయ్యకు కొంచెం సహాయం చెయ్యవూ?"

"నిజంగా చదువుకున్నవాళ్లంత హృదయవిహీనులూ, ఆశారహితులూ లేరు జీవితంలో. మానవ విజ్ఞానంలో ఉన్నతపథాల నందుకుందామని ఎవరికీ ఉండదు కుట్రచేద్దామనే కాని. వాళ్లనిండా కుళ్లు, ఈర్ష్య ఉంటాయి. మానవత్వం ఉండదు వాళ్లల్లో. అక్కయ్యకు వున్న విశాలహృదయం నాకు లేక పోయింది. వెంటనే "భాస్కరాన్ని మన గడప

తోక్కనివ్వకు"అని నా అమూల్యమైన సలహా యిచ్చాను.

"నిజంగా అలా చేసి నీఅక్కయ్య ఇంకా బతికుంటుందిటే పిచ్చిపిల్లా ?"

ఆమాటల్లో, అని అనేటప్పుడు దాని కనుల కంపులో ఎంత దృఢనిశ్చితాభిప్రాయం వుందీ!!!

"తనని ప్రేమించే ప్రాణి లేక నిత్యం అతని హృదయం పడే బాధను నేనుమాత్రమే వూహించగలను. నీ కెలా తెలుస్తుందే చెల్లాయి ?"

నిజమే. నా కెలా తెలుస్తుంది? చెప్పినా అర్థం చేసుకోలేనేమోకూడా.

మర్నాడు పొద్దున్నే మాబావ వొచ్చాడు. భాస్కరం అలా వీధులో కెళ్లి పదిగంటలకల్లా తిరిగి వచ్చేసరికి—వాళ్లు కలిసి తీయించుకున్న ఫోటోలని ఫ్రేముల్లోంచి తీసేస్తూ కూర్చున్నాడు మాబావ. అక్కయ్య చూసిందది.

"అంతబాధగా వుంటే పగలగొట్టరాదూ"అంది.

"పగలగొట్టడంకూడా ఎందుకూ, అద్దంకూడా పాడు." గంభీరంగా, వెనక్కి తిరగకుండానే జవాబిచ్చాడు మాబావ.

"పిచ్చాళ్లు చేస్తా రాపని—కోపం తీర్చుకోడాని కది మార్గం కానేకాదు"అనికూడా అన్నాడు. అప్పుడే వచ్చి గుమ్మందగ్గిర నిలబడ్డ భాస్కరాన్ని బావ చూడకుండానే ఈమాట లన్నాడు. భాస్కరం బుర్ర తిరిగిపోయింది. తల రెండుచేతుల్తోనూ పట్టుకుని వెళ్లిమంచంమీద తెలివితప్పి పడిపోయాడు.

నేనూ, అక్కయ్యా ఎన్నో ఉపచారాలు చేశాక అతనికి తెలివొచ్చింది. సాయంత్రం భాస్కరం ఎక్కడికో వెళ్లిపోతానని ప్రయాణం కట్టేడు. వెంటనే మాబావ—"మాలతీ, ఆ నీపటాలు అతని కిచ్చెయ్యి" అన్నాడు. మాలతి దీనంగా చూసింది. బావకూడా ఆట్టే బలవంతం చెయ్యలేదు. భాస్కరం వెళ్లిపోయాడు.

నాలుగురోజులు పోయాక అక్కయ్యకు వచ్చిన కవరొకటి బావ విప్పి చదివాడు. చదవేకొద్దీ అతని ముఖం వికృతాకారం చెందడం ప్రక్కనే వున్న నేను గ్రహించాను. అది నాచేతి కిచ్చి చెప్పాడు.

"పద్మా, మీఅక్కయ్య కియ్యి ఈవుత్తరం. చింపి చదివినందుకు క్షమాపణ అడిగాననికూడా అడుగేం." ఇలా అని, ఒక్కక్షణం నుంచోకుండా డ్రాయింగురూముకు వెళ్లిపోయాడు.

చదివీచదవడంతోనే మాలతి నిలువునా కూలబడిపోయింది.

"ప్రియమైన మాలతీ,

ఈశ్వరానికి తెలియకుండా మనం కలకత్తా వెళ్లిపోదాం. అక్కడ ఏర్పాట్లన్నీ చేస్తున్నా—వస్తాను—నాతో వస్తావుకదూ—నన్ను ప్రేమిస్తావుకదూ!

నీభాస్కరం."

అప్పటినుంచీ బావ దానితో ముభావంగా ఉంటూవచ్చాడు. మానసికవ్యథతో అది మంచం ఎక్కింది. అంచేత నాప్రయాణం వాయిదాపడింది.

సాయంత్రం తలంటి నీళ్ళుపోసుకుని జుట్టు ఆరబెట్టుకుంటున్నాను, డాబామీద ఇటూఅటూ తిరుగుతూ. పౌర్ణమిచంద్రుడు మెల్లిమెల్లిగా పైకి లేస్తున్నాడు. నా మెదడునిండా ఎన్నో ఆలోచన లున్నాయేమో, రెండుమాట్లు పిలిచినా పలకకపోవడంవల్ల బావ మెల్లిగా దగ్గరకు వచ్చి బుజంమీద చెయ్యేశాడు.

"మాట్లాడవేం పద్మా. అక్కయ్యకు మళ్లీ జ్వరం వచ్చేసింది. చూశావా ?"

"అగ! ఇవేళేగా పత్యం పెట్టాం—అందుకనే తీరిక దొరికి కాస్త తలంటి నీళ్ళుపోసుకున్నానాయె—

"ఏం బావా. అక్కయ్యను క్షమించవూ. అ దేమీ ఎరగదు బావా. అనవసరంగా వ్యథపడుతోంది. అలా దాని మనస్సు కష్టపెట్టడం నీకుమాత్రం మంచిదా బావా ?"—దీనంగా బతిమాలినట్లు అడిగాను.

"దానిమీద నాకేం కోపం లేదు పద్మా. దాన్ని నే ప్రేమించినంతగా ఎవరూ ప్రేమించరు. కాని భాస్కరాన్నిగురించే......దాని సుఖంకోసం ఏదైనా త్యాగం చేస్తా పద్మా."

"పద్మా" అన్న అక్కయ్యపిలుపు వినపడే దాకా ఇద్దరం అలాగే నిలబడివున్నాం. గబగబా మేడ దిగి వెళ్ళాను......

మర్నాడు అక్కయ్యకు జబ్బు మరీ ఎక్కువైంది. బతకదేమో అన్నంతవరకూ వచ్చింది.

౪

ఆ సమయంలో భాస్కరం ఊడిపడ్డాడెక్కణ్ణుంచో. సంగతి విని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు. వెంటనే వెళ్లి మంచంమీద కూర్చుని కన్నీళ్ళతో "మాలతీ—నే వచ్చాను—ఇలా చూడు..."

భాస్కరాన్ని డాబామీదికి తీసుకెళ్లాను. నాకు ఏడుపు, కోపం ఆగడంలేదు.

"ఛీ! నీముఖం చూడకూడదు. నీవల్లే ఇదంతా జరిగింది. మా అక్కయ్య చచ్చిపోతే నీకు సంతోషం కాబోలేం?" అన్నాను.

భాస్కరం ఏమీ సమాధానం చెప్పలేదుకాని ఏడుస్తున్నాడు–అదే సమాధానం నాప్రశ్నకు అన్నట్టు.

"పండంటి కాపరంలో నిప్పులుపోశావేం—మాబావ అలా అనుమానంపడ్డాడంటే, ఇది ఇలా మంచం ఎక్కింది! నీకు దయలేదూ—నువ్వు మళ్లీ మాయింటికి రాకుండా వెళ్లిపో—" ఇంకా ఏమేమో అనేస్తున్నాను కోపంలో ఏడుస్తూ.

భాస్కరంకళ్లల్లో నీళ్లు ఇగిరిపోయాయి. మార్పు ముఖంలో స్పష్టంగా కనపించింది. మర్నాడు అక్కయ్య బతుకుతుందని మాకెవ్వరికీ నమ్మకంలేదు. అంత్యసందేశాలివ్వడం మొదలెట్టింది. చావు తెలివన్నారు అందరూ. నన్ను పిలిచి 'చెల్లీ'అని కౌగిలించుకుని ఏడిచింది.

"నే నెలాగా చచ్చిపోతాను. చచ్చిపోయే ముందు ఒక్క సందేహం తీర్చుకు మరీ పోతాను"అని–

"భాస్కరం! నీమాలతి ఇక వుండదు—ఆఖరుసారిగా నన్నొకసారి—నా నుదురు ముద్దు పెట్టుకుంటావా? మనశ్శాంతితో చచ్చిపోతాను." అంది.

ఈ వింతకోర్కకు అందరం ఆశ్చర్యపోయాం. భాస్కరం మాఅందరి ముఖాలకేసీ పరీక్షగా చూశాడు. తల దించేసుకుని ఏడుస్తూ అక్కణ్ణుంచి లేచి వెడుతున్నాడు.

"ఆగు, భాస్కరం — మాలతి ఆఖరుకోర్కె తీర్చకుండానే వెళ్తున్నావా?" మాబావే అన్నాడిలాగ—అవును బావే—

భాస్కరం ఆగలేదు. బావకూడా ఆ గదిలోంచి లేచి అవతలికి వెళ్లిపోయాడు. బావ చాలా కలవరపడినట్టు కన్పించాడు—చాలా కలవరపడ్డాడు.

ఒకవంక చావుబతుకులమీద వున్న అక్కయ్య–మరొకవైపు బావ కోపం. నేను దుఃఖం ఆపుకోలేకపోయాను. అరగంట అలాగే కూచున్నాను. గట్టిగా ఏడ్చెయ్యాలని వుంది. కాని ఇంట్లో అన్నింటికీ పెద్దని నేనే అయిపోయాను. భాస్కరంకూడా వచ్చి మంచం దగ్గరే కూర్చున్నాడు. అక్కయ్యకు కొద్దిగా కునుకు పట్టింది. ఇంజక్షనుచేసి డాక్టరు మళ్లీ కొంచెం ఆశ కల్పించాడు.

తిన్నగా డాబామీదికి నడిచివెళ్లాను. వెనకాలే భాస్కరం వచ్చాడు. "మీరు అక్కయ్యకు చాలా మనస్తాపం కలిగిస్తున్నారు. మాబావ మీలాంటి నీచుడు కాడు. అతనిలాంటి విశాలహృదయులీప్రపంచంలో లేరు. మీపనులు చూసి అతనేమీ ఈర్ష్యపడ్డంలేదు మాలతిప్రేమకు మీ రెక్కువగా పాత్రులయ్యేరే అని. కాని మీ నీచత్వం చూసిమాత్రం అసహ్యించుకుంటున్నాడు. మాఅక్కయ్యకు మీమీద ఉన్న ప్రేమలో సగమేనా మీకు దానిమీద ఉందా? ఉంటే తక్షణం వెళ్లిపోతారు మీరు."

"ఈశ్వరం ఈర్ష్యపడ్డం లేదూ—అవును పడడం లేదు"తనలో తనిలా అనుకున్నాడు వెఱ్ఱిగా. అయిదు నిముషాలు మాట్లాడకుండా నుంచుని తరవాత నా రెండుచేతులూ పట్టుకుని చాలా సీరియస్‌గా అన్నాడు: "నన్ను ముందు నువ్వు క్షమించాలి పద్మా. నే వెళ్లిపోతాను. మళ్లీ మీఎవ్వరికంటా పడనుకూడాను. కాని నే చనిపోయేవేళకుమాత్రం

మాలతిదర్శనం నే కోరుకుంటున్నాను. భగవంతుడి దయవల్ల మాలతి సుఖంగా వుంటుంది—జరం తగ్గి పోతుంది. తప్పులేవన్నా చేస్తే క్షమించమని అడిగానని ఈశ్వరాన్ని నామాటగా అడుగు—మాలతిని నన్ను మరిచిపొమ్మను."

ఈమాట లంటూంటే అతని కళ్లవెంట నీళ్లు వచ్చాయి. ఎంత కొద్దిరోజుల పరిచయం అయినా నాకూ బాధ అనిపించింది. అలా శూన్యంగా చూస్తూ నిలబడిపోయాను. ప్రకృతిలో పడేసరికి భాస్కరం నాపక్కని లేడు. అక్కయ్యదగ్గరికి వెడుతూంటే—నిద్రపోతోన్న అక్కయ్యకాళ్లకు దణ్ణంపెడుతోన్న భాస్కరం కనిపించాడు.

"ఏం చేస్తున్నావ్ భాస్కరం ?"

"చెల్లాయిదగ్గర సెలవు తీసుకుంటున్నాను పద్మా"

'మాలతి' అనడం మాని 'చెల్లాయి' అనడం ఇది అతని జీవితంలో రెండోసారి. "చిన్నవాళ్లకు దణ్ణంపెట్ట వచ్చా" అన్నాను.

"చెల్లాయివిషయంలో తప్పులేదు పద్మా" అన్నాడు.

తర్వాత భాస్కరం వెళ్లిపోయాడు.

బావ ఒంటరిగా మేడమీద పచార్లు చేస్తున్నాడు. అతనిదగ్గిరికి వెళ్లాను. చాలా కోపంగా వున్నట్లూ, వ్యగ్రుడైపోయినట్టూ వున్నాడు.

"బావా, అక్కయ్య చేసిన పనికి కోపం వచ్చిందికదూ. తప్పుగా అర్థంచేసుకోకు బావా—స్త్రీహృదయం నువ్వర్థం చేసుకోలేవు—మీమొగాళ్లు మిమ్మల్నే మీ రర్థంచేసుకోలే రసలు. స్త్రీలో ఎన్నో మార్పులు వాళ్లకే తెలీకుండా వస్తాయి బావా. వాటిని మీరు—మొగాళ్లు— మీ అభిప్రాయాల కనుగుణంగా అర్థంచేసుకుని గుణదోషవిచారణ చేస్తారు. అక్కయ్య విషయంలో నువ్వలాగే ప్రవర్తిస్తున్నావు బావా. అదే నీకు తగదు. స్త్రీలో ఊహించుకోలేని మార్పుల్ని తెచ్చిపెడుతుంది ప్రేమ. వాటి పరిమాణాన్ని అసలు ఊహించలేరు. భాస్కరం అంటే మాలతికి అలాంటి ప్రేమే. అది అతన్ని అన్నయ్యలాగే ప్రేమించింది. చిన్నదాన్ని, నీకు చెప్పతగ్గదాన్ని కాను— అయినా ఆలోచించవూ ?"

" నా కెవరిమీదా కోపం లేదు పద్మా......" అన్నాడు బావ.

అక్కయ్యకు వ్యాధి తిరుగుముఖం పట్టింది. తగ్గిపోయాక ఒకనాడు భాస్కరం తనకిచ్చిన పటాలను చింపిపారేసింది. బావ అదిచూశాడు. ఎంతబాధతో అవి చింపగలిగిందో గమనించాడు. అతని హృదయం నీరైపోయింది. అతనిచేత ఎన్నితిట్లు తిన్నా ఆ పటాన్ని ఇంతవరకూ పదిలంగా దాచుకుంటూవచ్చింది. కాని ఇవేళ ఆఖరుకు చింపిపారేసింది.

"మాలతీ" అన్నాడు.

"వస్తున్నా" అని దగ్గరకు వచ్చింది. దాన్ని తన కౌగిలిలోకి తీసుకుని—

"నువ్వంటే నాకేం కోపం లేదు మాలతీ—మీ అన్నయ్యిచ్చిన పటా లలా చింపేశా వేం ? నిన్ను నే నర్థంచేసుకున్నా మాలతీ—"

అతని కళ్లల్లోకి చూసి మళ్లీ తల దించేసింది మాలతి.

౫

రెండేళ్లు గడిచిపోయాయి. అక్కయ్యకు కొడుకు. నాకప్పుడు పెళ్ళి అయింది. ఇప్పుడు నాకో కూతురు కూడా వుంది. ఎప్పుడూ ఒకలాగే ఉండలేదు. కాని చూడాలనిపించింది వెడుతోంటే మీది.

నాక స్తనూనం వాణ్ణే ఎత్తుకో బుద్ధిఅవుతుంది. ముగ్గురం యౌవనంలో వున్నాం. ఏ విచారాలూ లేక కాలం గడిపేస్తున్న దినా లవి. హఠాత్తుగా ఓనాడు "చెల్లాయిని చూడాలి" అని భాస్కరందగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. అందరం వెళ్లాం. భాస్కరం టి. బి. తో బాధపడుతున్నాడు. అతన్ని చూడగానే అక్కయ్య ఒకటే ఏడుపు—"ఇలా అశ్రద్ధ చేశావేం" అంటో.

"నాకు బతకాలని లేదు. నా కెవరూ లేరు. దానికేం గాని నా వెనకటితప్పులు క్షమించవా చెల్లాయి! ఆవేళ నిద్రపోతోంటే నే నీ దగ్గిర సెలవుతీసుకున్నా.

ఇవేళ మళ్లీ చూశాను నిన్ను. శాశ్వతంగా సెలవు తీసుకుంటూ చెల్లాయి. నన్ను మరిచిపోవమ్మా......"

తరవాత నాకేసి తిరిగి "నువ్వు దేవతవు పద్మా. మాఅందరి జీవితాలూ దుఃఖమయాలు కాకుండా రక్షించావు. ఆవేళ నన్ను వెళ్లిపొమ్మన్నావు. ఇవేళ లోకం ఎదుటనుంచే వెళ్లిపోతున్నాను. తప్పులుంటే క్షమించు చెల్లాయి. మీరిద్దరే నాకు చెల్లాయిలు."

భాస్కరంహృదయంమీద తలపెట్టి ఏడుస్తూ అన్నాను: "నిన్నెంతో అగౌరవపరిచాను. నీచుడన్నాను. ఇంకా ఎన్నో అన్నాను. క్షమించమని అడగడానికి కూడా నాకర్హత లేదన్నయ్యా" ఆపైన ఇక చెప్పలేకపోయాను.

చనిపోయేముందు మాపాపని దీవించాడు. అందరికేసీ చూశాడు.

చెల్లాయీ !

పద్మా !

ఈశ్వరం !

సెలవు !

అక్కయ్య తెలివితప్పి పడిపోయింది. బావ కళ్లనీళ్లు గుక్కుకున్నాడు.

మరొక రెండేళ్ళు గడిచాయి. అక్కయ్యకూడా భాస్కరం అన్నయ్యను కలుసుకుంది. చనిపోయేసరికి అక్కయ్యకు ఇరవైఅయిదేళ్లుమాత్రం. లోకంలో సౌందర్యవతుల్లో ఒక్కర్తె లోపించింది. చనిపోయేముందు అది నాకు వప్పగించి వెళ్లినవి మూడే వస్తువులు— దాని డైరీ, పాపడు, బావ !

కన్నీళ్లతో స్వీకరించాను. 'అమ్మా' అని ఏడ్చే బాబీని గుండెకు అదుముకున్నాను.

"మీఅమ్మను నేనే బాబీ" అని వాడికెలా నచ్చజెప్పను ?

బావ పాపం వెఱ్ఱివాడు. "పద్మా, ఇక్కడే వుండి యిల్లు దిద్దుకోంటావా "

ఎందుకు వొప్పుకోను ? అక్కయ్యస్మృతి చిహ్నం బాబీయేగా ? ఆమాత్రానికే ఎంతో కృతజ్ఞత చూపాడతను.

"నీఅందం చూస్తే మీఅక్కయ్య జ్ఞాపకం వస్తుంది పద్మా"అంటాడు.

అక్కయ్యఅందంలో నాఅందం ఎన్నోవొంతు ?

ఒకనాడు అక్కయ్యడైరీ చదువుతున్నాను. భాస్కరాన్నిగురించిన చర్చ కన్పించింది. అక్కయ్య ఇలా రాసింది:

"భాస్కరానిది చాలా వింతైన మనస్తత్వం అతనిలో నన్ను చూస్తే subconscious(వ్యక్తావ్యక్తం)గా కామంప్రజ్వరిల్లేదనుకుంటాను. ఈశ్వరం ఈర్ష్య పడుతున్నాడనేసరికి అది మరీ ప్రజ్వరిల్లేది. కాని ఎప్పుడూ అతనికి నేనంటే సోదరీప్రేమే ఉండేది. కాకపోతే ఆనాటిరాత్రి అలా వెళ్లిపోతాడా? అతని మనస్తత్వం గ్రహించడానికే ప్రయత్నించా. "నిన్ను ప్రేమించా" నన్నాను. "నానుదుటిమీద ముద్దెట్టుకో" మన్నాను. పర్యవసానం అతను నన్ను సోదరిలాగానే ప్రేమిస్తున్నాడని తేలింది.

ఈశ్వరం ఈర్ష్యపడ్డం లేదని తెలిసేసరికి— అతనికి తెలియకుండానే ఆ subconsciousnessలోని కోరికకు దెబ్బతగిలింది. అతని మనస్సులో అతనికి తెలీకుండానే ఎంత ఘోరయుద్ధం జరిగిందీ?" ఇలా రాసింది.

అక్కయ్యముఖంలో ఎంతగా అందాలు ఒలికేవో దాని ప్రేమలోకూడా అంత అందం ఉంది; పవిత్రత వుంది.

అక్కయ్యది స్త్రీహృదయం— చాలామంది స్త్రీలకు మగహృదయాలుంటుంటాయి.

'పిన్నీ'అంటూ బాబీ వచ్చాడు. ఎత్తుకుని ముద్దెట్టుకున్నాను.

—:o:—